
# అమెరి'కులాసా' కథలు
## – వంగూరి చిట్టెన్‌రాజు





# -57-
# అర్గానిక్కూ- ఆవు పేడా కథ

**ఈ నూతన సంవత్సరం...** అనగా 2022వ సంవత్సరంలో నేను ఒక ముఖ్యమైన తీర్మానం చేసుకుని అది పాటించదల్చుకున్నాను. ఆ వివరాలలోకి వెళ్ళే ముందు ఇన్నాళ్ళూ నేను ఈ భూప్రపంచంలో కేవలం శాకాహారులూ, మాంసాహారులూ అనబడే పాత మాటలు పోయి వెజిటేరియన్ మరియు నాన్-వెజిటేరియన్ అనే రెండు రకాల మానవులూ, ఇతర జంతువులూ ఉంటాయి అనుకున్నాను. కానీ, ఇతర జంతువులకీ, మానవులకీ ఉన్న మరొక తేడా గురించి ఈ మధ్యనే మా బావ మరిది వలన తెలిసింది. అదేమిటంటే జంతువులకి లేనిదీ, మనకి మాత్రమే ఉన్నదీ ఆర్గానిక్ లేదా ఇనార్గానిక్ ఆహార పదార్ధాలు. జంతువులలో ఒక్క ఒక్క మానవుడు తప్ప ఇంకే జాతీ ఆహార పదార్ధాల పెంపకానికి రసాయనాలు వాడవు. ఎలా ఉంటే అలా తినెయ్యడమే. వాటికి వంటా, పెంటా బాధ లేదు, చాలా రోజుల నుంచీ వింటున్న ఈ ఆర్గానిక్ కాకుండా మనం మామూలుగా తినే వాటిని ఇనార్గానిక్ తినుబండారాలు అనాలి అని నా ప్రతిపాదన.!

అసలు జరిగిందేమిటె అంటే మా బావ మరిది.....అంటే మా (మీ) క్వీన్ విక్టోరియాకి స్వయానా తమ్ముడు ఆ మధ్య మా ఇంటికి చుట్టం చూపుగా వచ్చాడు. ఆ వచ్చిన వాడు, ఆదేదో ఆ చుట్టం చూపు చూసేసి, నవ్వేసో, నవ్వుకునో వెళ్ళిపోవచ్చుగా...కానీ అదేదో డాక్టర్ చూపు చూశాడు...ఎందుకంటే అతను పెద్ద పేరున్న డాక్టర్ మరి. అంచేత సొంత అప్ప గారిని చూసినా, నాలాంటి బ్రిలియంట్ బావ గారిని చూసినా కూడా ఆ డాక్టర్ బుద్ధి పోనివ్వడు. ఉన్న రెండు రోజులూ మా (మీ) క్వీన్ విక్టోరియా వండి పెట్టిన ఇనార్గానిక్ గుత్తి వంకాయ కూర, పరమాద్భుతమైన సాంబారు, నువ్వుల పచ్చడి అన్నీ తిని, "అక్కా, అన్నీ బావున్నాయి కానీ నువ్వూ, బావ గారూ ఈ వయసు లో తినాల్సినవి వేరే ఉన్నాయి. అంచేత ఒక పూట అవీ, రెండో పూట ఇవీ తిని సద్దుకు పోవాలి" అని నేను వినకుండా ఆవిడకి ప్రైవేటు చెప్పి, నాకు తెలియకుండా ఆవిడని అదేదో కూరల కొట్టుకి తీసుకెళ్ళి ఏమేమిటో నాకు తెలియని పదార్ధాలు పట్టుకొచ్చి మా వంటింట్లో పడేశాడు. ఆర్గానిక్ తోటకూర, ఆర్గానిక్ ఎర్ర బెల్ పెప్పర్ అనబడే కాప్సికమ్, ఆర్గానిక్ టొమేటోలు, ఆర్గానిక్ అమెరికన్ దోసకాయ, అదేదో కేల్ అనబడే ఆకు కూర, అమెరికన్ తోటకూర ..అవి కూడా ఆర్గానిక్కే, ఆర్గానిక్ కేరట్స్,

ఆర్గానిక్ ఆముదం నూనె, ఆర్గానిక్ సముద్రం ఉప్పు,,,ఆర్గానిక్ వల్లకాడు, వశినపురం..ఇలా అన్నీ ఆర్గానిక్కులే. అవన్నీ చూడ్డానికి మామూలుగానే ఉన్నాయి. అన్నీ అమెరికన్ కూరాల లాగా వేటికీ ఆ కూర తాలూకు వాసనా, ఘాటూ ఉండవు. అమెరికాలో ఆఖరికి పువ్వులు కూడా చూడ్డానికి సొగసుగానే ఉంటాయి కానీ ఇండియాలో లాగా సువాసన ఉండదు. సువాసన కావాలంటే వాటిమీద కూనేగా మరికొళూందు లాంటి పరిమళ ద్రవ్యాలు చల్లుకోవాల్సిందే1. ఆ కూరల దుకాణం పేరు “వరల్డ్ ఫుడ్ మార్కెట్” ట. అవి మమ్మల్ని తినమని చెప్పడమే కాక, మా ప్రవరలో వచ్చే భరద్వాజుడూ, ఆపస్తంబుడూ, ఇంకా వాల్మీకీ, వ్యాసుడూ,,,ఇలాంటి ఋషులు అందరూ సరిగ్గా అలాంటి ఆర్గానిక్ ఆకులూ, అలములూ తినబట్టే వంద కాదు, వేల సంవత్సరాలు బతికారుట. అంచేత బేక్ టు ఫ్యూచర్! కావాలంటే కాశీ వెళ్ళి చూడండి. ..మొన్న మన ప్రధాన మంత్రి గారు నిండా మునిగి తర్పణం, జపం చేసిన పవిత్ర గంగా నదికి అవతలి వొడ్డున వందా, రెండు వందల ఏళ్ళ వయసు ఉన్న నగ్న సాధువులు కూడా అలాగే ఆకులూ, అలములూ తింటూ, గాలి భోజనం చేస్తూ, యోగా చేస్తూ హాయిగా కనపడతారు....ట. ఇదీ మా బావ మరిది మాకు తీసుకున్న క్లాసు. అలాంటి సాదువులని నేను నిజంగానే ఒక బి.బి.సి. వాళ్ళ ప్రోగ్రామ్ లో చూశాను కానీ వాళ్ళెవరూ అంత హాయిగా మటుకు కనపడ లేదు.

ఈ ఆర్గానిక్ పదార్థాలు తింటే కేన్సరూ, కోవిడూ లాంటివి రావు అని కూడా వినగానే ఇహ చూడండి....మా (మీ) క్వీన్ విక్టోరియా రెచ్చిపోయింది. ఉదాహరణకి మొన్నటి మొన్న నేను వాల్ మార్ట్ లో సేల్ లో ఉన్నాయి కదా అని ఒక ఆరు చెడ్డీల అండర్ వేర్ పేకెట్ కొనుక్కుని ఇంటికి రాగానే ఆవిడ ఆ పేకెట్ ని అటూ, ఇటూ తెగ తిరగేసి “ఇది ఆర్గానిక్ చెడ్డీ కాదుగా. ఎందుకు కొన్నావు? ఆర్గానిక్ వాడమని మా తమ్ముడు చెప్పలేదూ? అసలు నీకు వాడంటే పడదు” అని ఎక్కడ నుంచి ఎక్కడికో వెళ్ళిపోయింది. అన్నీ చెప్పిన మా బావమరిది అసలు ఈ ఆర్గానిక్ చెడ్డీల ప్రస్తావనే తేలేదు. ఇప్పుడు నేను వాల్ మార్ట్ కి వెళ్ళి “ఈ ఇనార్గానిక్ చెడ్డీల బదులు ఆర్గానిక్ వెరైటీ కి ఎక్స్ ఛేంజ్ చేసుకోవచ్చునా?” అని అడిగితే ఆ వాల్ మార్ట్ అమ్మాయి మొహం ఎలా పెడుతుందో చూడాలని ఉంది.

ఈ దెబ్బకి ఇప్పుడు మొన్న టీవీలో చూసిన ఒక ప్రకటనలో “అసలు ఏమిటి ఈ బి ఎస్ ఎన్ ఎల్?” అని అడిగే ఒక అమ్మాయి లాగే “అసలు ఏమిటి ఈ ఆర్గానిక్? అని ఆరా తియ్యాలి అనుకున్నాను. ఇందులో పరమ రహస్యం ఏమిటంటే..నేను చిన్నప్పుడు చదువుకున్న ఆర్గానిక్ కెమిస్ట్రీ సబ్జెక్ట్ లో అత్తిసరు మార్కులతో గండం గడిచింది. నాకు అక్షరం ముక్క అర్థం అవని పాఠ్యాంశం ఏమన్నా ఉందా అంటే దానికి అగ్ర తాంబూలం ఆర్గానిక్కే! అంచేత ఆ నాటి ఆర్గానిక్కుకీ, ఈనాటి ఆర్గానిక్కుకీ ఏమన్న లింక్ ఉందా అనేది నా కుతూహలం. అంచేత గూగులమ్మని రక రకాల ప్రశ్నలు అడిగాను. స్థూలంగా చెప్పాలంటే....మట్టిని బలోపేతం చెయ్యడానికి ఏ విధమైన రసాయన పదార్థాలనీ, కలుషిత పదార్థాలనీ కలపకుండా కేవలం ప్రకృతి సహజ సిద్ధమైన నీరూ, ఇతర వనరులతో పండించిన ఆహార పదార్థాలూ..అనగా బియ్యం, గోధుమలూ, పళ్ళూ, కూరగాయలూ మొదలైన వెజిటేరియన్ పదార్థాలు ఒక ఎత్తు అయితే ఏ విధమైన

మందులూ, హార్మోన్ లూ వాడకుండా పెంచిన కోళ్ళూ, తదితర మాంసాహారాలనీ "ఆర్గానిక్" అని అమెరికాలో USDA వారు గుర్తించి, ముద్రా వేస్తారు అని తెలిసింది. అయితే నాకు ఆశ్చర్యం కలిగించిన అంశం ఏమిటంటే USDA వారు కేవలం "ఆర్గానిక్" అవునా, కాదా అని మాత్రమే నిర్ణయిస్తారు. కానీ ఈ ఆర్గానిక్ పదార్థాలు మామూలు వాటికంటే ఎక్కువ మేలు చేస్తాయి అని ఎక్కడా చెప్పలేదు. అది వారి బాధ్యత కాదట.! ఏది ఎలా ఉన్నా, ఈ ఆర్గానిక్ ఆహార పదార్థాలు వంటికి మంచిది అని కొంత మందీ, పర్యావరణానికి అంతకంటే మంచిది అని మరికొంత మందీ, ముఖ్యంగా బాగా డబ్బున్న వాళ్ళు అందరూ ఆర్గానిక్కులే.

ఉదాహరణకి మొన్న మా క్వీన్ విక్టోరియా "మాంచి చారు చేస్తాను. వెళ్ళి కాస్త బెల్లం పట్రా" అంది ఎంతో ప్రేమగా. వెంటనే నాకు రెండు ప్రేమలూ, ఒక అనుమానం వచ్చేశాయి. మొదటి ప్రేమ మీరు ఊహించినట్టుగానే చారు మీద! నాకు చారు అన్నంలో కలుపుకుని తినడం కంటే గ్లాసులో పోసుకుని, మా తోటలో కూచుని హాయిగా తాగుతూ ఆస్వాదించడం భలే ఇష్టం. కావాలంటే అలాంటి ఫోటో ఒకటి ఇక్కడ చూడండి.



ఇక రెండో ప్రేమ ఎవరి మీదో వేరే చెప్పక్కర లేదు...అలా చారు కాచిన వాళ్ల మీదే!. ఇక నాకొచ్చిన అనుమానం అల్లా.....చారులో బెల్లం వేయుదురా అని మాత్రమే..."అదంతా మనకెందుకులే...ఆవిడ చారు కాచును, మనము తాగెదము" అని అనుకుని నేను మన ఇండియా పచారీ కొట్టుకి వెళ్ళి .....జాగరీ పేరిట ఉన్న అక్కడ దజన్ల కొద్దీ బెల్లం సరుకులని చూసి కాస్త కంగారు పడ్డాను. కారణం ఏమిటంటే....అక్కడ బెల్లం సీసాలు, డబ్బాలు, పొట్లాలలో కొన్ని పౌడర్ రూపంలోనూ, క్యూబ్ ల లాగా ఉన్నా, వాటిల్లో కూడా....అవును..ఆర్గానిక్ జాగరీ..వేరే రంగు సీసాలలో, డబ్బాలలో, పొట్లాలలో కనపడ్డాయి. వాటిల్లో ఇనార్గానిక్ బెల్లం ఒక పొట్లాం డాలర్ నైన్ టీ నైన్..అనగా $1.99 అయితే అదే ఆర్గానిక్ పొట్లాం $4.99...మరి నా గుండె ఆగిపోయిందీ అంటే ఆగిపోదూ? అప్పటికప్పుడు నాకు అనకాపల్లిలో రోడ్డు మీద పరిచిన బెల్లం బుట్టలూ, మా ఇంటికి ప్రతీ ఏటా ఒక బెల్లం బుట్ట పంపించే రైతు గుడాల వెంకటేశూ, "నా చెరుకు పంటకి సరి అయిన ధర ఇవ్వకపోతే బెల్లం ఆడించుకుంటాను" అని ఒక సుగర్ ఫేక్టరీ వాళ్ళని బెదిరించిన నా చిన్ననాటి స్నేహితుడు భమిడిపాటి ప్రసాద రావూ...ఇవన్నీ గుర్తుకొచ్చి "ఇప్పుడు ఆర్గానిక్ బెల్లంతో చారు బాగా వచ్చునా, లేక ఇనార్గానిక్ బెల్లం చాలునా?" అనే అనుమానం పెనుభూతంలా నన్ను ఆవరించింది. "ఏది కొనమంటావ్?" అని ఒకానొక సర్వ సాధారణ అమెరికా భార్యావిధేయుడి లాగా మా(మీ) క్వీన్ విక్టోరియా ని సెల్ ఫోన్ లో పిలిచి అడగవచ్చును

కానీ...అప్పుడు వినపడే ప్రైవేటు క్లాస్ వినగలమా? అంచేత “అన్నమైతేనేమిరా, మరి సున్నమైతేనేమిరా, మన పాడు పొట్టకు ఆర్గానిక్కే మేలురా” అని అదే కొన్నాను మరి.

ఈ ఆర్గానిక్కుకి మరో పార్శ్వం హైడ్రోఫోనిక్ ట. అంటే మట్టీ, మశానమూ అక్కర లేకుండా మొక్కలు నీళ్లలోనే వేసి ఆ నీళ్లలోనే వాటికి కావలసిన ఎరువులు కలిపి పంటలు పండించడం అనమాట. అంటే మనం ఎప్పుడైనా మన ఖర్మం చాలక, అక్కడి డాక్టర్ ఋణం తీర్చుకోడానికీ ఆసుపత్రికి వెళ్ళాం అనుకోండి. మా అమెరికా ఆసుపత్రులలొ అయితే ముందు ముంజేతికి కంకణం కడతారు. అంటే మనం తప్పిపోతే తెలియడం కోసం మన ఊరూ, పేరూ, జన్మదినం వగైరాలు వ్రాసి ఉన్న పతకం కట్టగానే వెంటనే పెద్ద సూది రక్తనాళం లో గుచ్చి ‘ఐవీ’ పెడతారు. అంటే మన శరీరంలోకి ద్రవపదార్థాలు పంపించే ఏర్పాటు అనమాట. ఇక ఆసుపత్రిలో ఉన్నన్నాళ్ళూ మనది హైడ్రోఫోనిక్ బతుకే!. ఆవకాయా, గోంగూరా లాంటి ఘనమైన ఘన పదార్థాలన్నీ మానేసి, ఈ ఐవీ లోనే పోషక పదార్థాలూ, మందులూ, అప్పుడప్పుడు మత్తు మందులూ ..అంటే స్కాచ్ లూ, వోడ్కాలూ కాదు... అన్నీ కలిపేసి ఇలా అంతా హైడ్రోఫోనిక్ వైద్యమే!. ఇనార్గానిక్ ఆహారం లాగానే ఈ హైడ్రోఫోనిక్ వైద్యం అన్నమాట కూడా నేను కనిపెట్టిందే. గమనించగలరు. నోబెల్ ప్రైజ్ ఇచ్చేవారికి చెప్పగలరు.

ఇక నేను కనిపెట్టిన...ఎక్కడా వాళ్ళు పైకి చెప్పని మరొక రహస్యం ఏమిటంటే ......ఇలా ఆరానిక్కూ, హైడ్రోఫోనిక్కూ లాంటి అన్ని వ్యవసాయాలకీ ప్రధానమైన ఎరువు పదార్థం....ఆవు పేడ అయితీరాలి. ఎందుకంటే కేవలం గడ్డీ, గాదమూ తిని బతికే గోవులు స్వతస్సిద్ధంగా ఆర్గానిక్కులే.! అలాగే పిడకలతో వంట చేసినా అది ఆర్గానిక్ వంటే కదా!. ఈ రహస్యం మా (మీ) క్వీన్ విక్టోరియాకి తెలియకుండా చాలా జాగ్రత్త పడుతున్నాను. తెలిస్తే ఇప్పుడు మా వంటింట్లో ఆర్గానిక్ పిడకలతో కుంపటి మీద ఆర్గానిక్ బెల్లంతో ఆర్గానిక్ చారు కాచగా అది నేను మా తోటలో కూచుని చచ్చినట్టు అది తాగవలసిన అగత్యం వచ్చే అవకాశం ఉంది మరి!. ఈ ఆ.పే. రహస్యం ఎలా తెలిసిందీ అంటే... మొన్న




హోమ్ డిపో అనే కొట్టుకు వెళ్ళి మా తోటలో ఉన్న మొక్కలకి ఏమైనా ఎరువుల కోసం చూస్తున్నప్పుడు ఈ ఆర్గానిక్ తతంగం గుర్తుకు వచ్చి, అక్కడ ఆసామీని “ఈ మిరకిల్ గ్రో, అమోనియం ఫాస్ఫేట్, నైట్రోజెన్ సల్ఫేట్ లాంటి రసాయనాలు కాక ఆర్గానిక్ ఎరువులు ఏమైనా ఉన్నాయా?” అని అడగగానే “ఎందుకు లేవూ” అని ఒక పెద్ద ఎరువుల సంచీ చూపించి ‘అది కొనుక్కో’ అన్నాడు. ఆ సంచీ మీద “కౌ మెన్యూర్” అని ప్రస్ఫుటంగా ముద్రించి ఉంది. అంటే మరి ఆవు పేడ, పిడకలే కదా!.




ఇక ఈ ఆర్గానిక్ "పిచ్చి ముదిరింది. తలకి రోకలి చుట్టమనే" వాళ్ళు ప్రపంచం నిండా చాలా మందే ఉన్నారు. ఉదాహరణకి మొన్న కాస్ట్ కో అనే పేద్ద స్టోర్ కి వెళ్తే అక్కడ దుప్పట్లూ, తరగడాలూ అమ్మే చోట చూసిన ఒక ఫొటో ఇక్కడ జతపరిచాను. జాగ్రత్తగా చూస్తే అది "ఆర్గానిక్' అని పెద్ద అక్షరాలతో బాత్ టవల్స్ అని కనపడుతుంది. నాకు తెలియక అడుగుతానూ, మనం స్నానం చేశాక, ఆవు పేడతో మాత్రమే పండించిన పత్తితో చేసిన ఆర్గానిక్ తువ్వాలుతో ఒళ్ళు తుడుచుకోవాలంటారా? అంతకంటే దౌర్భాగ్యం ఆర్గానిక్ టాయ్ లెట్ పేపరే. ఇంత ఓవర్ ఏక్షన్ అవసరమా? మళ్ళీ పైన ఉదహరించిన వరల్డ్ ఫుడ్ మార్కెట్ కొ వస్తే.. అక్కడ ఇనార్గానిక్ తినుబండారాలు దొరకనే దొరకవు. అక్కడ ఏమి కొనాలన్నా ఖరీదు చూడకూడదు. చూస్తే కళ్ళూ తిరిగి పడాల్సిందే!. హైడ్రోఫోనిక్ వైద్యానికి ఆసుపత్రిక్ పోవాల్సిందే! ఆ ధరల కనపడే ఫొటో ఇక్కడ పెట్టాను. ధైర్యం ఉంటే చూడండి. అందులో ఆర్గానిక్ ఆవాలు, జీలకర్ర, నువ్వులు, గరమ్ మసాలా, ఉప్పు వగైరాలు, పక్కనే ఉన్న కూరల అరలలో ఆర్గానిక్ అల్లం, ఉల్లిపాయలు, గోధుమలు, తోటకూర..ఒకటేమిటి....అన్నీ ఆర్గానిక్కే,,అవన్నీ అమ్మే అమ్మాయిలతో సహా!. అన్నట్టు, .ఆ మధ్య మన వాళ్ళ అమెరికా జాతీయ జాతర్లకి వెళ్తే అక్కడ భోజనాల దగ్గర నాలుగు రకాల లైన్లు కనపడ్డాయి. దేని రంగు జెండా దానిదే!. ఆర్గానిక్ వెజిటేరియన్ వారికి ఆవు పేడ రంగు,,అంటే లేత ఆకుపచ్చ, ఆర్గానిక్ నాన్–వెజిటేరియన్ వారికి నీలం ఇనార్గానిక్ వెజిటేరియన్ వారిది కాషాయం ఇనార్గానిక్ నాన్–వెజిటేరియన్ లైన్లలో పసుపు. ఇలా ఇక్కడా రాజకీయ కండువా రంగుల ప్రకటనలే!

ఇక ఈ నూతన సంవత్సరంలో ఈ ఆర్గానిక్కు నుంచి ఇనార్గానిక్కుకి మా (మీ) క్వీన్ విక్టోరియాని వెనక్కి రప్పించడమా లేక తప్పదు రా సుమతీ అని మనం కూడా ఆ బ్యాండు మేళంలో చేరిపోవడమా అనేదే నేను చేసుకోవాల్సిన తీర్మానం. ఆర్గానిక్కూ, ఇనార్గానిక్కూ వర్గాల అందరు పాఠక దేవుళ్లకీ నూతన సంవత్సర శుభాకాంక్షలతో...మనలో మన మాటగా..నేను ఆర్గానిక్ వ్యతిరేకిని కాదు సుమండీ. కొంత మంది చాదస్తం, ఓవర్ ఏక్షన్ చూస్తే నవ్వొస్తుంది, అంతే!.

**COMMENTS**